క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నది అగ్రహారం రోడ్డులోని 132కేవీ సబ్ స్టేషన్ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో 33కేవీ బస్ఆఫ్ చేస్తారని, దీంతో తాత్కాలిక అంతరాయం కలుగుతుందని ఏడీఈ రమేష్ బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 33కేవీ పరిధిలోని గద్వాల టౌన్, వీరాపురం, జమ్మిచేడు, బీరెల్లి, పూడురు, అదేవిధంగా ధరూరు ఫీడర్ పరిధిలోని ధరూరు, మన్నాపురం, గోన్‌పాడు, మల్దకల్ 33కేవీ పరిధిలోని బిజ్వారం, నర్సన్‌దొడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర లైన్లకు శనివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

అయిజ మండలంలో..

అయిజ: మండలంలోని వెంకటాపురంలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శనివారం మరమ్మతు చేపట్టుతుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌కు మరమ్మతు చేపట్టాల్సి ఉండడంతో శనివారం ఉదయం వెంకటాపురం, పర్దిపురం, ఉప్పలలో ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

ముమ్మరంగా పీపీఆర్ టీకాలు



అయిజ: గొర్రెలు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, కొత్తపల్లిలో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. మొత్తం 3,845 గొర్రెలకు, 185 మేకలకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి తెలిపారు.

పాగుంట ఆలయంలో పూజలు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అమ్మవారికి కిరీటం తయారీకి బంగారం వితరణ చేశారు. అంతకుముందు ఆలయంలోని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వారి జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, రామాంజనేయులు, సంజీవ్‌భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టెంపాడులో డ్రై డే



ధరూరు: మండలంలోని నెట్టెంపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్య పర్యవేక్షకుడు హీర్యా నాయక్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి డ్రమ్ముల్లో నీటిని పారబోసి శుభ్రం చేయించారు. శుక్రవారాన్ని పొడి దినంగా నిర్వహించాలన్నారు. కాల్వలు, డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విషజ్వరాల లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలన్నారు. ఇంట్లో పాత్రలను శుభ్రంగా కడిగి ఉంచుకోవాలన్నారు. ఆహారం తీసుకునేటప్పుడు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సునీత, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని శింగవరం–2కి చెందిన కుర్వ మానస(20) వివాహిత గురువారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మడుగు రమేష్ తెలియజేశారు. శింగవరం–2కి చెందిన కుర్వ మల్లయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె మానసను ఏడాదిన్నర కిందట కర్నూల్ జిల్లా, గోనెగండ్ల మండలం వేముగోడ్‌కి చెందిన మనోహర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం భార్యాభర్తలు బాగానే ఉన్నారని, కొన్ని రోజులుగా కట్నం తక్కువగా తీసుకొచ్చావని వేధిస్తున్నాడని అలంపూర్ పీఎస్‌లో కేసు పెట్టింది. కొద్ది రోజుల కిందట మల్లయ్య, భార్య పద్మావతి, కుమార్తెతో కలిసి ఎద్దులబండిపై కుటుంబ సమస్యలు మాట్లాడుకుంటున్నాడు. శింగవరానికి చెందిన నాగభూషణం నువ్వు నా గురించి మాట్లాడుతున్నావని అసభ్య పదజాలంతో అతని కుమార్తెను తిట్టాడు. గురువారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తన కుమార్తె మనస్తాపంతో ఉరి వేసుకుని మృతిచెందింది. తండ్రి కుర్వ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

నిరుపయోగంగా చేతిపంపులు

- ప్రతి గ్రామంలో రెండు నుంచి ఐదు చేతిపంపులు
- నియోజకవర్గంలో సుమారు 670 చేతిపంపులు
- మిషన్‌భగీరథ నీరు అంతంత మాత్రమే
- చేతి పంపులు బాగుచేయించి నీటి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్న ప్రజలు



వడ్డేపల్లి మండలం జూలెకల్‌లో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

శాంతినగర్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల కోసం తవ్విన చేతి పంపులు నిరుపయోగంగా మారాయి. గతంలో తాగు, నిత్యావసరాలకు వాటిని ప్రజలు విరివిగా వాడేవారు. తదుపరి పరిణామ క్రమంలో చిన్న పాటి ట్యాంకులు, అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో చేతిపంపుల ప్రాధాన్యత తగ్గిపోయింది. అప్పట్లో ట్యాంకుల ద్వారా పుష్కలంగా నీరు అందడంతో ప్రజలు, అధికారులు చేతిపంపుల మరమ్మతుల గురించి దృష్టి సారించలేదు. దీంతో చేతిపంపులకు మంగళం పాడినట్లయ్యింది. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో సుమారు 670 వరకు చేతిపంపులు ఉన్నాయి. ఉపయోగంలోలేక అన్ని నిరుపయోగంగా మారాయి. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పశువులకు కుంటలు, చెరువుల్లో, గుంతల్లో నీరు లేక, కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీరందక ప్రజలు, మూగ జీవాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈవిషయమై మండల పరిషత్ అధికారులు స్పందించి గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులను మరమ్మతు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

విరిగిపోయిన చేతి పంపులు

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన చేతిపంపులు విరిగి పోయాయి. నట్ బోల్టులు, వెల్డింగ్‌లు చేయించకపోవడంతో ఉపయోగపడటంలేదని ప్రజలు వాపోతున్నారు.

పాత సామాన్లకు అమ్ముకుంటున్న అగంతకులు

చేతి పంపులతో ఉపయోగం ఉండదని భావించి వదిలేయడంతో ఇదే అదునుగా భావించిన దుండగులు పాత సామాన్ల వారికి విడి భాగాలను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. చేతిపంపుల ఆనవాళ్లు కనిపించకుండా పోతున్నాయి.

స్థలాల ఆక్రమణ

ఆయా గ్రామాల్లోని గ్రామ కంఠం, ప్రభుత్వ మిగులు స్థలాల్లో ఏర్పాటుచేసిన చేతిపంపులను తొలగించి ఆ స్థలాలను కొందరు ఆక్రమించుకుని నామరూపాలు లేకుండా చేశారని ప్రజలు వాపోతున్నారు. చేతిపంపుల సమీపంలో ఉన్న ఇళ్లవారు వాటిని ఒక్కొక్కటిగా తొలగించి బోరు బావులను మూసి వేశారని చెబుతున్నారు.

కోట్లలో ప్రజాధనం వృథా

చేతిపంపులను వృథాగా వదిలేయడంతో ప్రజాధనం రూ.కోట్లలో వృథాగా మారింది. ఒక్కో బోరు బావికి సుమారు రూ.40 నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన 670 బోరు బావులకు వెచ్చించిన సుమారు రూ.33 కోట్ల ప్రజాధనం వృథాగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నీరు చాలడం లేదు



మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామానికి వచ్చే నీరు తాగడానికి, వాడుకోడానికి చాలడం లేదు. ఉదయం సాయంత్రం ఒక్కొక్కరికి రెండు బిందెలే వస్తాయి. ఇంట్లో ఉన్న నలుగురికి చాలడం లేదు. సమీపంలో ఉన్న చేతి పంపు పనిచేయడం లేదు. మరమ్మతు చేయించి నీటి ఇబ్బందులు తొలగించాలి.

– ఆంజనేయులు, జూలెకల్

ఆక్రమించుకున్నారు



మా బీసీ కాలనీలో ఉన్న చేతి పంపు స్థలాన్ని ఆక్రమించుకున్నారు. చేతిపంపు చుట్టూ మట్టిపోశారు. చేతిపంపు నిరుపయోగంగా మారింది. శుభకార్యాల సమయంలో చేతి పంపు వద్ద పూజలు చేసేవాళ్లం. చేతిపంపును కబ్జా చేయడంతో నీటి సమస్య తలెత్తుతోంది. మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలి.

– భాస్కర్, యాపదిన్నె

మరమ్మతు చేస్తాం



ఏ గ్రామంలోనైనా నీటి సమస్య ఉంటే చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తాం. మిషన్ భగీరథ పథకం ద్వారా ఉదయం, సాయంత్రం నీటిని విడుదల చేయిస్తున్నాం. నీటి సమస్య ఉన్న వారు సంబంధిత మండల పరిషత్ కార్యాలయంలో, కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే జీపీ ఫండ్ నుంచి మరమ్మతు చేయిస్తాం.

– రవీంద్ర, ఎంపీడీఓ, వడ్డేపల్లి

ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతి, అక్రమాలకు మారుపేరని గతపాలనను చూస్తే అందరికీ స్పష్టమవుతుందన్నారు. అసమర్థ నాయకుల వల్ల వలసలు, విద్యుత్ కోతలు, రైతుల ఆత్మహత్యలు నిత్యకృత్యంగా ఉండేవన్నారు. ఆనాడు తెలంగాణను నిండాముంచిన పార్టీ కాంగ్రెస్ అని, ఇప్పుడు పదేళ్ల సీఎం కేసీఆర్ పరిపాలనలో అన్నిరంగాల్లో దూసుకెళ్తుందన్నారు. విపత్కర కరోనా సమయంలో తనపై నమ్మకం పెట్టి గెలిపించినందుకు అందరికీ అందుబాటులో ఉండి తనవంతుగా సేవలందినట్లు గుర్తుచేశారు. ఆసమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. కేవలం అధికార కాంక్షతోనే పార్టీ మారి ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేయాలని చూస్తున్నట్లు వివరించారు. వారి మాటలు నమ్మితే గద్వాల ప్రజలు మోసపోవడం ఖాయమన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్‌ను, ఇక్కడ నన్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయన గద్వాల నియోజకవర్గంలోని పట్టణంలోని 18వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సరళమ్మ, 34వ వార్డుకు చెందిన అన్వర్‌లు తమ అనుచరులతో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. అదేవిధంగా ధరూరు, కేటీదొడ్డి, గద్వాల, మల్దకల్ మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో ప్రత్యేక పూజలు

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బండ్ల జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ వేస్తున్న నేపథ్యంలో బూరెడ్డిపల్లి సీతారాముల ఆంజనేయ స్వామి ఆలయంలో, మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు చిరు, భాస్కర్‌రెడ్డి, రవి ఆధ్వర్యంలో శివాలయంలో పూజలు నిర్వహించారు. మరనాథ విస్వాస సమాజ మందిరంలో పాస్టర్ సురేష్, సంఘ సభ్యులు ప్రార్థనలు చేశారు.

పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహ

ఎర్రవల్లిచౌరస్తా: అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ స్నేహ సూచించారు. శుక్రవారం ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ హాజరై ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులతో పాటు ఆయా గ్రామాలలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు అందేలా చూడాలని సూచించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను గుర్తించాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజా ప్రతినిదులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లగా.. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, ఎంపీడీఓ రాఘవ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ



పెద్దఆముదాలపాడులో..

మల్దకల్: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ లింగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కు వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా దానిని స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటు హక్కు వినియోగంపై వివరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంకు వివిధ పనుల కోసం వచ్చిన ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శివకుమార్, గోవర్ధన్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

మానవపాడు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకూడదని ఎంపీడీఓ రమణరావు సూచించారు. శుక్రవారం మండలంలోని అమరవాయి, పెద్దఆముదాలపాడులో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఏదైనా సమాచారం ఇవ్వాలంటే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతివ్వండి: ఎమ్మెల్సీ



మందా జగన్నాథంతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజేయుడుకు అందరూ మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటి విందుకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడుని ఆశీర్వదించి సంపూర్ణ మద్దతు తెలిపి గెలిపించడం కోసం తన వంతు కృషి చేయాలని మందాను కోరారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరై ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్నికల్లో తన ఆశీర్వాదం కావాలని కోరారు.

ఇంటింటి ప్రచారం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో అలంపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు, నాయకులు ఏకమై గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



బొంకూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

మానవపాడు: మండలంలోని కొర్విపాడులో శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి విజేయుడు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్లాను సన్మానించిన ఎర్రవల్లి వాసులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కృష్ణసాగర్, రాఘన్న, రాముడు, ధర్మారెడ్డి, కృష్ణ, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మహమ్మదాబాద్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓమహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన పుట్టి శంకరయ్య, శాంతమ్మ(48) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ, కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం దగ్గర్లో ఉన్న చౌదర్‌పల్లి సంతకు శాంతమ్మ, కుమారుడు అశోక్ ద్విచక్ర వాహనంపై కూరగాయలు తీసుకుని వెళ్లారు. మార్గమధ్యలో బోరింగ్ తండా సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా వారి వాహనానికి కుక్క అడ్డుగా వచ్చింది. ఈ క్రమంలో వారు బైక్ పైనుంచి కిందపడిపోయారు. ఘటనలో అశోక్‌కు స్వల్పగాయాలు కాగా, శాంతమ్మ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో ఆమెను మొదట ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం శాంతమ్మ మృతిచెందింది. ఘటనపై ఆమె భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల గ్రామ సమీపంలో గొల్ల నర్సింహ(70)వృద్ధుడి మృతదేహం లభ్యం అయ్యింది. స్థానికుల వివరాల ప్రకారం చిన్నంబావి మండలం, బెక్కెం గ్రామానికి చెందిన గొల్ల నర్సింహకు మతిస్థిమితం లేదు. వారం రోజుల నుంచి గ్రామంలో తిరుగుతూ రోడ్లపైనే నిద్రిస్తున్నాడు. శుక్రవారం గ్రామ శివారులో అచేతన స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్తులు గమనించి మృతిచెందినట్లు గమనించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్

గద్వాల అర్బన్: మౌలాన అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి అనేక సంస్కరణలు చేసిన మహోన్నత వ్యక్తి అని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష కొనియాడారు. శుక్రవారం మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతిని డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతినే 2008లో ప్రభుత్వం జాతీయ విద్యాదినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు గూగుల్ ఫాం ద్వారా జాతీయ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కలాం ఆశయాలే స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో విద్యావ్యవస్థకు పునాదులు వేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఇటువంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గద్వాల అర్బన్: ప్రతి విద్యార్థి పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా చదవాలని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్‌కం పార్టీని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రమశిక్షణ, విద్యతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యతో పాటు సాంస్కృతిక, వాణిజ్య, ఆర్థిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొని సంపూర్ణ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితేనే ఉన్నతంగా స్థిరపడవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు లవీన మంజులత, నర్సింహులు, కృష్ణమూర్తి, నాగభూషణం, ఏఓ మక్బూల్ అహ్మద్, విద్యార్థులు ఉన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ



నందిన్నెలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది చక్రవర్తి, రేఖరెడ్డి, జగదీష్ ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంపత్ కుమార్ వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్స్–2 అధికారులు తనిఖీ చేశారు. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించి వారికి సహకరించారు.

దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు



మానవపాడు: దీర్ఘకాలిక రోగులకు ఎన్సీడీ, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ రిజ్వానతస్వీర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జల్లాపురంలో ఎన్సీడీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు అయ్యేలా చూడాలన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఐరన్, కాల్షియం, విటమిన్ సీ మాత్రలు ఇవ్వాలన్నారు. చిన్నారులకు వ్యాక్సిన్‌ను ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాలలో ఉండే అన్ని రకాల కార్యక్రమాలను విధిగా ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీహెచ్ఓ సత్యానారాయణ, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కమిటీ ఎన్నిక

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కృష్ణ, ప్రధానకార్యదర్శిగా భద్ర ఎన్నికైనట్లు సంఘం సభ్యులు తెలిపారు.